

సదస్సులో దీపం వెలిగిస్తున్న జె.పి.నడ్డా, పక్కన సీఎం మోహన్ తదితరులు

పరిశ్రమలకు పూర్తి సహకారం

★ పెట్టుబడులకు ప్రభుత్వం గ్యారంటీ ★ త్వరగా నిర్మాణాలు చేపట్టాలి: సీఎం మోహన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఖనిజ సంపదలకు నిలయమైన ఉత్కళ రాష్ట్రం పెట్టుబడిదారులకు ఎర్ర తివాచీ పరిచిందని, పరిశ్రమలు ఏర్పాటు చేసేవారికి ఒకేచోట త్వరగా అనుమతులు ఇస్తున్నామని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాఝి చెప్పారు. ముంబయిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండురోజుల పెట్టుబడుల సదస్సులు నిర్వహించాయి. శుక్రవారం కేంద్ర రసాయనాల శాఖ 'ముంబయి ఇండియా కెం-2024' సదస్సు చేపట్టింది. కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జె.పి.నడ్డా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దేశ, విదేశాలకు చెందిన రసాయన కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఇందులో పాల్గొన్న ముఖ్యమంత్రి మోహన్ మాట్లాడుతూ పరదీప్, గోపాల్‌పూర్, ధమ్రా రేవులు రసాయనాల తయారీకి అనుకూలమని వివరించారు. తమ ప్రభుత్వం పరిశ్రమలకు పూర్తి సహాయ సహకారాలు అందజేస్తుందన్నారు. మంచినీరు, విద్యుత్తు, రహదారులు, విమానాశ్రయాల సౌకర్యాలు తగినన్ని ఉన్నాయన్నారు. గోపాల్‌పూర్ ప్రత్యేక ఆర్థిక జోన్(సెజ్)లో నిర్మాణాలు చేసేవారికి రాయితీలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి సంపద్ స్వాయిన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహుజా, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి హేమంత్‌శర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు ఉత్కర్ష ఒడిశా సదస్సు

శనివారం ముంబయిలో మోహన్ ప్రభుత్వం ఉత్కర్ష ఒడిశా పెట్టుబడిదారుల సదస్సు చేపట్టనుంది. ప్రముఖ కంపెనీలకు చెందిన 300 మంది పాల్గొననున్నారు. పెట్రోకెమికల్, ఉక్కు, అల్యూమినా, టెక్స్‌టైల్, ఆహారోత్పత్తులు, పర్యాటక రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి వారిని కోరనున్నారు. పరిశ్రమల శాఖ మంత్రి సంపద్ విలేకర్లతో మాట్లాడుతూ సదస్సు మంచి ఫలితాలు ఇస్తుందన్న ఆశాభావం ఉందన్నారు.

అమ్మో.. పులి


పెద్ద పులిని పట్టుకునేందుకు ఎరగా కట్టిన గేదె

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా ఉత్తర ఘుముసుర అటవీ డివిజన్‌లోని గంగపూర్ అటవీ రేంజ్ పరిధిలో అయిదారు రోజులుగా మహారాష్ట్ర నుంచి వచ్చిన పెద్ద పులి సంచారం ప్రజల్ని భయపెడుతోంది. మాలతి కొండ ప్రాంతానికి సుమారు రెండు కి.మీ. దూరంలోని బాలిపట గ్రామ శివారులో ఇటీవల అది ఓ జంతువును చంపి తిన్నట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో అటవీశాఖ ఆధ్వర్యంలో సిమిలిపాల్ నుంచి వచ్చిన పులుల్ని పట్టుకునే ప్రత్యేక బృందం, ర్యాపిడ్ రెస్పాన్స్ బృందం సభ్యులు పులి కదలికలపై నిఘా పెట్టారు. బహుశా అది సమీపంలోని అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయి ఉంటుందని అనుమానిస్తున్నారు. వ్యాఘ్రాన్ని పట్టుకునేందుకు సిమిలిపాల్ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం ఓ గేదెను గురువారం మాలతి కొండ సమీపాన ఎరగా కట్టారు. దానిని బంధించడానికి బోనును కూడా సిద్ధం చేశారు. వివిధ చోట్ల ట్రాప్ కెమేరాలు అమర్చారు. మూడు బృందాలుగా విడిపోయిన అటవీ సిబ్బంది మాలతి కొండ ప్రాంతం చుట్టూ కాపలా కాస్తున్నారు. పశువుల్ని అడవిలోకి మేపేందుకు తీసుకెళ్లరాదని అధికారులు గ్రామస్థుల్ని కోరారు. మాలతి కొండ సమీపాన గంగపూర్, ఝూడ బంధ పంచాయతీలకు చెందిన వివిధ గ్రామాల ప్రజలు పులి సంచారంపై భయాందోళనలకు గురవుతున్నారు.


అటవీ ప్రాంతంలో అమర్చేందుకు తీసుకువెళుతున్న బోను

మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు?

17 జిల్లాలకు ప్రాతినిధ్యం కరవు

ఆశావహుల నిరీక్షణ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: మోహన్‌చరణ్ మాఝి ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసి నాలుగు నెలల సమయం పూర్తయింది. ఇంతవరకు మంత్రివర్గ విస్తరణ జరగలేదు. ఆశావహులు నిరీక్షిస్తున్నారు. ఈ విషయమై నాయకత్వం మౌనం వహించడానికి కారణాలేమిటి? అన్నదిప్పుడు చర్చనీయాంశమైంది.

న్యాయం చేయలేకపోతున్న మంత్రులు

ఈ ఏడాది జూన్ 12న భాజపా సర్కారు బాధ్యతలు చేపట్టింది. అప్పట్లో ముఖ్యమంత్రి మోహన్‌తో పాటు మరో 15 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. వీరిలో 10 మందికి కేబినెట్ హోదా లభించింది. మరో అయిదుగురు స్వతంత్ర హోదా గల మంత్రులుగా బాధ్యతలు స్వీకరించారు. మంత్రిమండలిలో సీఎంతో కలుపుకొని 22 మంది ఉండాలి. మరో ఆరుగురికి పదవులు ఇవ్వాల్సి ఉంది. అప్పట్లో పక్షం రోజుల తరువాత విస్తరణ జరుగుతుందని భాజపా పెద్దలు చెప్పారు. ఇది నెరవేరలేదు. బడ్జెట్ సమావేశాలు ముగిసిన తరువాత ముహూర్తమని చెప్పారు. ఇదీ అమలవలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఒక్కో మంత్రి వద్ద నాలుగేసి శాఖలున్నాయి. కొందరికి అనుభవం లేదు. శాఖలకు న్యాయం చేయలేని పరిస్థితి కనిపిస్తోంది. శాసనసభ సమావేశాల నేపథ్యంలో ప్రశ్నోత్తరాల్లో కొందరు మంత్రులు సమాధానం చెప్పలేక తమశాఖల కార్యదర్శుల ముఖాలు చూశారు.



వలస వచ్చినవారికి ప్రాతినిధ్యం కరవు

ఎన్నికల ముందు ప్రధాన పార్టీలను వీడి భాజపాలో చేరి గెలిచిన వారికి ఆ పార్టీ నాయకత్వం మంత్రి మండలిలో స్థానం కల్పించలేదు. అరెస్సెస్‌తో సంబంధాలున్నవారికే అవకాశమిచ్చారు. కేంఝర్, గంజాం, బొలంగీర్, ఝార్సుగుడ, సంబల్‌పూర్, కొరాపుట్, ఖుర్దా, ఢెంకనాల్, జగత్సింగ్‌పూర్, జాజ్‌పూర్, భద్రక్, మయూర్‌భంజ్, పూరీ జిల్లాల నేతలకు మాత్రమే మంత్రిమండలిలో అవకాశమిచ్చారు.

ఇదే కారణమా?

మంత్రిమండలిలో మరో ఆరుగురికి స్థానం కల్పించాల్సి ఉండగా, భాజపా నాయకత్వం ఎందుకు తాత్సారం చేస్తోందన్న విషయమై పార్టీ అగ్రనేతలెవరూ పెదవి విప్పడం లేదు. బిజదలో చీలిక వస్తుందని, కొంతమంది శాసనసభ్యులు భాజపాలో చేరుతారన్న అంచనా ఉంది. వీరికి స్వాగతించి మంత్రి మండలిలో చేర్చుకుంటారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇదింతవరకు జరగలేదు. బిజదకు చెందిన ఎమ్మెల్యేలు భాజపాలో చేరతారని, తలుపులు తెరిచే ఉంచామని ఆ పార్టీ అగ్రనేతలు కొన్నాళ్లుగా పునరుద్ఘాటిస్తున్నారు.

వేచి చూసే ధోరణిలో నాయకత్వం

పోరుగు శిబిరంలోని నేతల కోసం వేచి చూస్తున్న భాజపా నాయకత్వం లక్ష్యం నెరవేరని పక్షంలో పార్టీకి విధేయులుగా ఉన్నవారికి పదవులు కేటాయించే అవకాశం ఉంది. ఆరు మంత్రి పదవులకుగాను 20 మంది ఆశావహులు వేచి చూస్తున్నారు. ప్రస్తుతం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతోంది. ఇది మరో నెలరోజులు కొనసాగనుంది. ఇది ముగిసిన తరువాత మంత్రి మండలి విస్తరణ జరుగుతుందన్న అంచనా ఉంది. కార్పొరేషన్ ప్రణాళికా బోర్డులు, సహకార సంస్థల అధ్యక్ష పదవులనూ భర్తీ చేస్తారని విశ్వసనీయంగా తెలిసింది.


అర్జిపల్లి గ్రామానికి ముప్పుగా మారిన అలల కోత

రాకాసి అలలు..

కొట్టుకుపోయిన తుపాను రక్షిత కేంద్రం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా ఛత్రపురం సమితిలోని అర్జిపల్లి మత్స్యకార తీర గ్రామానికి రాకాసి అలలు ముప్పుగా మారాయి. ఎగిసిపడుతున్న అలలతో తీరం కోతకు గురవుతోంది. దీనితో తీరాన గల తుపాను రక్షిత కేంద్రం సాగర జలాల్లో కొట్టుకుపోవడంతో శిథిలాలు మాత్రమే మిగిలాయి. దీంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనలనకు గురవుతున్నారు.

గ్రామానికి చేరువుగా..


రాకాసి అలలకు కొట్టుకుపోగా మిగిలిన రక్షిత కేంద్రం శిథిలాలు

అర్జిపల్లి గ్రామానికి ఒకప్పుడు సుమారు మూడు కి.మీ. దూరాన సముద్ర తీరముండేది. గ్రామ శివారులోని తీరానికి సమీపాన రక్షిత కేంద్రంలో మత్స్యకారులు సేద తీరేవారు. వారి వలలు, తదితరాలు అక్కడే భద్రపరుచుకునేవారు. పదిహేనేళ్లగా మత్స్యకారులు ఆధారపడుతున్న ఈ కేంద్రం తాజాగా అలల కోతకు కొట్టుకుపోయింది. దీనికితోడు గ్రామానికి కేవలం 300 మీటర్ల దూరానికి తీరం చొచ్చుకు రావడంతో గ్రామస్థులు ఆందోళన పడుతున్నారు. తక్షణం తీరాన రాతితో రక్షణ గోడ నిర్మించాలని జిల్లా యంత్రాంగానికి విన్నవించినట్లు మత్స్యకారులు లింగరాజ బెహరా, బాసుదేవ బెహరా తదితరులు శుక్రవారం విలేకరులకు చెప్పారు.

250 నీటి మీటర్లు చోరీ


ఇక్కడి మీటరును తస్కరించారు


సిమిలిగుడ, న్యూస్‌టుడే: పట్టణంలో ప్రజా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నీటి పైపులకు అమర్చిన మీటర్లను దుండగులు చోరీ చేస్తున్నారు. గత కొద్దిరోజులుగా ఈ చోరీలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతంలో కైలాస్‌నగర్, ఓసీసీ నగర్‌లో మీటర్లు ఎత్తికెళ్లిన విషయం తెలిసిందే. ఇటీవల గాంధీ, నెహ్రూనగర్‌లో ఎక్కువగా మీటర్లను దొంగలు మాయం చేశారు. గురువారం రాత్రి సుమారు 12 మీటర్లను దొంగలించారు. పట్టణంలో ఇప్పటివరకు 250 వరకు తస్కరణకు గురయ్యాయి. పోలీసులు దుండగులను పట్టుకోలేకపోయారు. రాత్రివేళల్లో పెట్రోలింగ్ చేయకపోవడంతో ఈ ఘటనలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

త్వరలో ఆరోగ్య కార్డులు


ముఖేష్ మహాలింగ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో త్వరలో ఆయుష్మాన్ భారత్ పథకం అమలు కానుందని, మూడున్నర కోట్ల మందికి కొత్తకార్డులు పంపిణీ చేస్తామని ఆరోగ్యశాఖ మంత్రి ముఖేష్ మహాలింగ చెప్పారు. శుక్రవారం భువనేశ్వర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బీఎస్‌కేవై, ఆయుష్మాన్ లబ్ధిదారులకు ఒకే కార్డు కేటాయిస్తామన్నారు. బీఎస్‌కేవై కింద 957 ఆసుపత్రుల్లో చికిత్స సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, ఆయుష్మాన్ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా 27 వేల ఆసుపత్రుల్లో సేవలు అందిస్తారని చెప్పారు. కొత్త రేషన్‌కార్డుల పంపిణీ కోసం ఈకేవైసీ సర్వే జరుగుతోందన్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆయుష్మాన్, బీఎస్‌కేవై స్థానంలో అమల్లో ఉన్న గోపబంధు కార్యక్రమాల కింద నమోదైన వారందరికీ ఆరోగ్యకార్డులు అందిస్తామన్నారు.

చీలిక దిశగా బిజద: జయనారాయణ



భువనేశ్వర్, న్యూస్‌టుడే: బిజద ప్రాంతీయ పార్టీకిప్పుడు నాయకత్వం లోపించిందని, చీలిక తథ్యమని భాజపా అగ్రనేత జయనారాయణ మిశ్ర చెప్పారు. శుక్రవారం సంబల్‌పూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిజదలో ఇప్పుడు అసంతృప్తి సెగలు భగ్గుమంటున్నాయన్నారు. ఎంతోమంది నేతలు పార్టీని వీడి భాజపాలో చేరడానికి సంప్రదింపులు జరుపుతున్నారన్నారు. అందర్నీ చేర్చుకునే పరిస్థితి లేదని, విశ్వసనీయత పరిగణనలోకి తీసుకుంటామన్నారు. బిజదలో కొద్దిరోజుల్లో అనూహ్య మార్పులు జరుగుతాయని చెప్పారు.



ఏనుగుల్ని కాపాడండి

రాష్ట్రంలో రైళ్లు ఢీకొని, వేటగాళ్లు అమర్చిన విద్యుత్తు తీగలు తగిలి చాలాచోట్ల ఏనుగులు మృతిచెందుతున్నాయి. వీటిని కాపాడాలని కోరుతూ బ్రహ్మపురకు చెందిన కళాకారుడు సత్యనారాయణ మహరణా సైకత శిల్పం రూపొందించాడు. శుక్రవారం సాయంత్రం ఆయన బెజ్జిపురం కాళీ మందిరం సమీపాన సుమారు ఎనిమిది అడుగుల ఎత్తు, ఇరవై అడుగుల వెడల్పున ఏనుగు సైకత శిల్పాన్ని తీర్చిదిద్దాడు. –న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం


శ్రీక్షేత్ర పాకశాలలో వంటలు

'ఒబడా' కొనలేని పరిస్థితి

పెరిగిన ధరలు

భక్తుల అసంతృప్తి

నెయ్యి రాయితీ పరిశీలిస్తామన్న మంత్రి

గోపాలపూర్, న్యూస్‌టుడే

పవిత్ర కార్తిక మాసంలో పూరీ జగన్నాథుని దర్శనానికి పలువురు భక్తులు వస్తుంటారు. ఈ నెల రోజులు శ్రీక్షేత్రం యాత్రికులతో కిటకిటలాడుతుంది. వచ్చిన వారంతా 'ఒబడా'(మహాప్రసాదం) ఆరగిస్తారు. భక్తులకు ప్రీతిపాత్రమైన దీని ధర ఇప్పుడు అమాంతం పెంచేశారు. సామాన్యులు కొనుగోలు చేసి తినే పరిస్థితి లేదన్న విమర్శలు, అసంతృప్తి వ్యక్తమవుతున్నాయి.

ఓంఫెడ్ నెయ్యితో వంటకాలు

ఇదివరకు ఒబడాతోపాటు స్వామికి అర్పణమయ్యే 56 రకాల పిండి వంటకాలు రకరకాల నెయ్యితో తయారు చేసేవారు. తిరుపతి లడ్డూలో పశువుల కొవ్వు వినియోగిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో శ్రీక్షేత్ర యంత్రాంగం స్వామి ప్రసాదాలకు కల్తీకి తావులేని ఓంఫెడ్ నెయ్యినే వినియోగించాలని ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నెయ్యి కిలో రూ.563లు కాగా పురుషోత్తమునికి అర్పణయ్యే ప్రసాదాలు తయారుచేసే సువార్, మహాసువార్ సేవాయత్‌లు ఒబడా, ఇతర ప్రసాదాల ధరలు అమాంతం పెంచేశారు.

చిన్న కుండ రూ.200లు

గతంలో రూ.160లు పెట్టి ఒబడా కుండ కొనుగోలు చేస్తే ముగ్గురు లేక నలుగురు కడుపునిండా ఆరగించేవారు. అన్నం, ముద్దపప్పు, ముక్కల తీపి పులుసు, కూరగాయల ఇగురు, అరటికాయ, తోటకూర వేపుడు ఆనందబజారు (స్వామి ప్రసాదాల మార్కెట్)లో లభ్యమయ్యేది. ఇప్పుడు రూ.200లు పెడితే చిన్న మట్టి పాత్రలో కాస్తంత అన్నం, పప్పు, ఒకే కూర ఇస్తున్నారు. ఇది ఒకరికే సరిపోతోంది. ఎంగిలి లేని జగన్నాథుని ప్రసాదాలు ఇదివరకు అందరూ కలసి ఆరగించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. స్వామి దర్శనం తరువాత ఆనందబజారుకు వస్తున్నవారు పెరిగిన ధరలు విని ఉసూరుమంటున్నారు. ఒక కుటుంబం వారు కడుపు నిండా ఒబడా తినాలంటే రూ.వెయ్యి నుంచి రూ.1500 వెచ్చించాల్సి వస్తోంది. ఇదివరకు రూ.5లుగా ఉన్న ఖొజ్జా, ముదుకా ఇప్పుడు రూ.15లుగా విక్రయిస్తున్నారు. పూరీస్వామి దర్శనం చేసుకుని స్వగ్రామాలకు వెళ్లి ప్రసాదాలు ఆప్తులకు పంచేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఇది సొమ్ము ఉన్నవారికే పరిమితమైందని సామాన్యులంటున్నారు.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



ఆనందబజారు ప్రసాదాల విషయంలో ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని అంతా అంటున్నారు. దాతలు కరుణిస్తే ఉచితంగా ఒబడా సమకూరుస్తామని ఇటీవల న్యాయశాఖ మంత్రి **పృథ్వీరాజ్ హరిచందన్** పేర్కొన్న సంగతి తెలిసిందే. దర్శనానికి వచ్చే భక్తులందరికీ చిన్న మట్టి పాత్రల్లో ఉచితంగా ఒబడా అందజేయాలన్న ధ్యేయం ఉందన్నారు. దీనికయ్యే వ్యయం ప్రభుత్వం భరించే పరిస్థితి లేదని, దాతల సహకారంతోనే సాధ్యమవుతుందన్న ఆయన ఈ దిశగా సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఇది ఎప్పట్లోగా జరుగుతుందన్న దానిపై స్పష్టత లేదు.

రాయితీ పరిశీలిస్తాం



మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి **గోకులానంద మల్లిక్** గురువారం రాత్రి పూరీలో విలేకర్లతో మాట్లాడుతూ పూరీ శ్రీక్షేత్రానికి దీపాలకు, ప్రసాదాలకు అవసరమైన ఓంఫెడ్ నెయ్యి రాయితీ ధరలకు విక్రయించే అంశం పరిశీలిస్తామన్నారు. దీనిపై త్వరలో ఉన్నతస్థాయి సమావేశం చేపట్టి నిర్ణయం తీసుకుంటామన్నారు.

ధరల పట్టికలు వేలాడదీస్తాం



శ్రీక్షేత్రం పాలనాధికారి **సిద్ధార్థ్ శంకర్ స్వయిన్** విలేకర్లతో మాట్లాడుతూ ఆనందబజారులో ధరల పట్టికలు వేలాడదీస్తామన్నారు. ఏ ప్రసాదానికి ఎంత ఖర్చవుతోంది, తయారు చేసిన వారికి ఎంత గిట్టుబాటుండాలి అన్నది పరిశీలించి ఏకపక్షంగా ధరల నిర్ణయం చేయకుండా చర్యలు తీసుకుంటామన్నారు.


పవిత్రం, పునీతం...ఈ ప్రసాదాలు

అన్ని ధరలు పెరిగాయి

తామేమీ చేయలేమని, అన్ని నిత్యావసరాల ధరలు పెరిగాయని వంటలు చేసే సేవాయత్‌లంటున్నారు. కూరగాయల ధరలు ఒకవైపు మండుతున్నాయని, మరోవైపు ఓంఫెడ్ నెయ్యితోనే వంటకాలు చేయాలని నిబంధన విధించారని, దీంతో చౌకధరలకు ఎలా విక్రయించగలమని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం సామగ్రి కొనుగోలుపై రాయితీ ఇస్తే ధరలు తగ్గుతాయంటున్నారు. మరోవైపు సేవాయత్‌లు ఏకపక్షంగా ధరలు నిర్ణయిస్తుండడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పీసీసీ నేత ఎంపికకు పరిశీలకులు


చరణ్‌దాస్ మహంత

భువనేశ్వర్, న్యూస్‌టుడే: గత నాలుగు నెలలుగా పీసీసీ అధ్యక్ష పదవి ఖాళీగా ఉంది. ఏఐసీసీ అధిష్ఠానం రాష్ట్రంలో పార్టీ అనుబంధ సంఘాలన్నింటినీ రద్దుచేసిన తరువాత ఇంతవరకు కొత్త కమిటీలు, అధ్యక్షుల నియామకాలు చేయలేదు. ఈ నేపథ్యంలో భువనేశ్వర్‌లోని కాంగ్రెస్ భవన్ కళతప్పిన సంగతి తెలిసిందే. శరత్‌పట్నాయక్ తప్పుకున్న తరువాత అధ్యక్ష పదవి ఎవర్ని వరిస్తుందన్న దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి అజయ్‌కుమార్ ఫోన్ ఇన్ ద్వారా కొంతమంది సీనియర్ నాయకులతో మాట్లాడారు. పదవికి ఎవరు న్యాయం చేయగలుగుతారన్న దానిపై అభిప్రాయ సేకరణ చేశారు. కేంద్ర మాజీ మంత్రి శ్రీకాంత్ జెనా, సీనియర్ నేతలు శరత్‌రౌత్, మహమ్మద్ ముఖిం పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఇంతలో గురువారం రాత్రి ఛత్తీస్‌గఢ్ శాసనసభా పక్షం (సీఎల్పీ) నేత చరణ్‌దాస్ మహంతను అధిష్ఠానం పరిశీలకునిగా నియమించింది. ఆయనకు సహాయంగా మీనాక్షి నటరాజన్ ఉంటారు. వీరిద్దరు త్వరలో భువనేశ్వర్ చేరుకుని సీనియర్ నాయకులతో సమావేశమై పరిస్థితి సమీక్షిస్తారు. అనంతరం ఏఐసీసీకి నివేదిక సమర్పిస్తారు. దీన్ని ఆధారంగా చేసుకుని పీసీసీ నేత పేరు ప్రకటిస్తారని తెలిసింది.

21న సీఎం వినతుల స్వీకరణ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి 21న (సోమవారం) ప్రజల వినతులు విని ఇబ్బందులు పరిష్కరిస్తారు. దసరా వేడుకల నేపథ్యంలో గత సోమవారం సీఎం వినతుల కార్యాలయం తెరవలేదు. ఈసారి ముఖ్యమంత్రి వెయ్యిమందితో మాట్లాడతారని సీఎంవో అధికారవర్గాలు శుక్రవారం తెలిపాయి. ఆయన వద్ద ఇబ్బందులు చెప్పేవారు సీఎంవోలో వివరాలు నమోదు చేసుకున్నారు.

కొంటిలి వద్ద 150 పడకల ఆసుపత్రి

హైటెక్ (గ్రూపు) సంస్థల ఆధ్వర్యంలో త్వరలో నిర్మాణం


వేదికపై సంచిక ఆవిష్కరిస్తున్న డా॥ తిరుపతి, బాబూసింగ్ తదితరులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని సుందరపద పరిధి కొంటిలి వద్ద అత్యాధునిక సౌకర్యాలతో 150 పడకల ఆసుపత్రి నిర్మాణం కానుంది. వైద్యసేవల్లో గుర్తింపు పొందిన హైటెక్ సంస్థ దీన్ని చేపట్టనుంది. గురువారం రాత్రి సుందరపదలో 'కుమార పౌర్ణమి మహోత్సవం' జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న హైటెక్ (గ్రూపు) సంస్థల అధినేత డా॥తిరుపతి పాణిగ్రహి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యసేవలు ధ్యేయంగా చేసుకున్న తమ సంస్థ పేదలకు ఉచితంగా చికిత్సలు అందిస్తోందని, కొంటిలిలో ఏర్పాటు చేయనున్న ఆసుపత్రి భువనేశ్వర్ ఏకామ్ర నియోజకవర్గం ప్రజలకు సేవలు అందిస్తుందన్నారు. భువనేశ్వర్ వికాస్ మంచ్ ఆధ్వర్యంలో జరిగిన కుమార ఉత్సవంలో స్థానిక శాసనసభ్యుడు బాబూసింగ్, వికాస్‌మంచ్ ప్రతినిధులు రజనీకాంత్ సామంత్రాయ్, డా॥ బి.కె. మహంతి, ఉమాకాంత్ జెనా, బిరజారథో, అలోక్ మహాపాత్ర్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదికపై అతిథులు 'వికాస్' సంచిక ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సాంస్కృతిక వేడుకలు నేత్రపర్వం చేశాయి. కార్యక్రమంలో భువనేశ్వర్ నగర ప్రముఖులు పాల్గొన్నారు.

శ్రీక్షేత్రంలో కార్తిక వ్రతాలు ప్రారంభం


పతిత పావనునికి మంగళహారతి

గోపాలపూర్, న్యూస్‌టుడే: హే జగన్నాథ రక్షమాం అన్న ప్రార్థనలతో పూరీ శ్రీక్షేత్రం శుక్రవారం మార్మోగింది. కార్తిక బహుళ పక్షమి పాడ్యమి తిథిని పురస్కరించుకుని ఇక్కడ హబిషార్థులు(దీక్షాధారులు) రాధా దామోదర వ్రతాలు ప్రారంభించారు. పవిత్ర పుష్కరిణుల్లో స్నానాలు చేసిన మహిళలు బృందావతి ఆరాధనతో వ్రతాలకు శ్రీకారం చుట్టారు. శ్రీక్షేత్రంలో జగన్నాథుని రాధా దామోదర అవతార దర్శనం చేసుకున్నారు.

సుదర్శన్ బిజె వేడుకలు



గోపాలపూర్, న్యూస్‌టుడే: కుమార పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి పూరీ శ్రీక్షేత్రంలో సుదర్శన్ బిజె వేడుకలు జరిగాయి. సేవాయత్‌లు ఆనవాయితీ ప్రకారం రత్నసింహాసనం పరిధిలోని సుదర్శనుని ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఖంబేశ్వర ఆలయానికి తీసుకెళ్లి పూజలు చేయించారు. తరువాత మళ్లీ శ్రీక్షేత్రానికి తెచ్చారు. భక్తులు ఈ వేడుకలో పాల్గొన్నారు. ఆలయంలో పురుషోత్తమునికి ఇతర గోప్యసేవలు నిర్వహించారు.

సుదర్శనునికి పల్లకిలో తీసుకెళుతున్న సేవాయత్‌లు

సమస్యల పరిష్కారానికి చర్యలు



గ్రామస్థులతో మాట్లాడుతున్న పురపాలిక ఛైర్మన్ లలిత్‌రంజన్‌సేరి

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ పురపాలిక పరిధి బడిలిగూడలో సమస్యలపై శుక్రవారం పురపాలక ఛైర్మన్ లలిత్‌రంజన్‌సెరి గ్రామస్థులతో చర్చించారు. ఊరిలో తాగునీరు, రహదారి, పారిశుద్ధ్యం తదితర మౌలిక అవసరాలపై ఆందోళనలు చేసి అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో పురపాలిక ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం ఆయన గ్రామంలో పర్యటించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు.

వృథానీటికి అడ్డుకట్ట పడేనా..

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సునాబెడ పురపాలక పరిధి వివిధ ప్రాంతాల్లో ప్రజా ఆరోగ్యశాఖకు సంబంధించిన నీటిపైపులు లీకై నీరు వృథాగా పోతోంది. సిమిలిగుడ పట్టణంలో అంబేడ్కర్‌నగర్‌లో పైపులకు రంధ్రాలు పడి కొద్ది రోజులుగా నీరు పారుతోంది. బస్టాండ్ సమీపంలోను ఇదే దుస్థితి. నందపూర్ ప్రధాన మార్గంలో రహదారిపై నీరు చేరి బురదమయమైంది. దీన్ని అరికట్టేందుకు ఆ శాఖ అధికారులు ఏ విధమైనా చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా యంత్రాంగం స్పందించి నీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



బురదమయంగా నందపూర్ ప్రధాన మార్గం

తొలగించిన వ్యర్థాలు



స్పందనకు వందనం

జయపురం పట్టణంలో ఉన్న చారిత్రాత్మకమైన జగన్నాథ్, ఖజూరిబంద్, నీలకంఠ సాగరాల పూడికతీత పనులు కొనసాగుతుండటంతో స్థానిక మహిళలు కార్తికమాస పూజలు ఎలా చేయాలని ప్రశ్నిస్తున్నారు. దీనిపై శుక్రవారం ఈనాడులో 'కార్తిక పూజలు జరిగేనా' అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. 'న్యూస్‌టుడే' ఈఓ సిద్ధార్థ్ పట్నాయక్‌ను సంప్రదించడంతో వెంటనే స్పందించారు. సాగరాల పనులు జరుగుతుండటంతో గోవర్ధనముండా సాగరం వద్ద పెరిగిన పిచ్చిమొక్కలను, ప్లాస్టిక్ సీసాలు, వ్యర్థాలను శుక్రవారం తొలగించారు. శనివారం ఖజూరిబంద్ సాగరం వద్ద కూడా శుభ్రం చేస్తామని ఈవో తెలిపారు.
– న్యూస్‌టుడే,జయపురం



జయపురంలో రాజ్‌నయార్ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారు



పర్లాఖెముండిలో కంద్ర వీధిలో పూజలు అందుకుంటున్న లక్ష్మీదేవి



రాయగడ సబ్‌కలెక్టర్ కార్యాలయం కూడలిలో..

వరాలివ్వమ్మా మహాలక్ష్మీ

పట్టణాల్లో గురువారం సాయంత్రం నుంచి గజలక్ష్మీ అమ్మవారి పూజలు ప్రారంభమయ్యాయి. 11 రోజుల పాటు దీపారాధన, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించనున్నారు. మండపాల వద్దకు భక్తులు చేరుకుని దేవిని దర్శించుకుంటున్నారు.
– న్యూస్‌టుడే బృందం

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● ఇద్దరికి గాయాలు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా పపదహండి సమితి మైదల్‌పూర్ ఠాణా పరిధిలో రహదారి ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఐఐసీ బిపిన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు నుంచి బొలంగీర్‌కు శుక్రవారం మూలికా ఔషధాలు విక్రయించడానికి కారులో ముగ్గురు వ్యక్తులు వస్తున్నారు. జాతీయ రహదారి-26పైన తులసిపొదర వద్ద వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఈ ఘటనలో గుంటూరుకు చెందిన చెందిన ఎస్.శ్రీనివాసరావు(50) మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల వాహనాన్ని స్వాధీనం చేసుకుని క్షతగాత్రులను పపదహండి ఆసుపత్రికి తరలించారు.

వ్యాను ఢీకొని విద్యార్థి మృత్యువాత

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: వ్యాన్ ఢీకొని ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన ఖరగ్‌పూర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ మిడ్నాపూర్ చంద్రకోణ రోడ్డు వైపు నుంచి సైకిల్‌పై వెళ్తున్న విద్యార్థి నిమయ్ ప్రమాణిక్(17)ను అటుగా వస్తున్న పికప్ వ్యాన్ బలంగా ఢీకొంది. క్షతగాత్రుడిని స్థానికులు ఆసుపత్రిలో చేర్చారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు చెప్పారు. ఆ ప్రాంతవాసులు ఈ ఘటనపై ఆందోళన చేపట్టారు. పోలీసులు చోదకుడిని అరెస్టు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

వాహనం బోల్తా .. నలుగురికి గాయాలు

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి గాజులమముడి పంచాయతీ బంధగుడ ఘాటిలో వ్యాన్ బోల్తాపడి నలుగురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే శుక్రవారం బంధగుడ గ్రామంలో కొంత మంది అలంపకాలో జరుగుతున్న వారపు సంతకి వ్యాన్‌లో వెళ్తున్నారు. ఈ సమయంలో గ్రామం సమీపంలో ఘాటిలో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. వ్యాన్‌లో సుమారు 15 మంది ఉండగా ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు జాన్‌బాయి ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

నాటు సారా స్వాధీనం

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్లా మత్తిలిలో అబ్కారీ శాఖ నాటు సారా కేంద్రంపై దాడి చేశారు. వివరాల్లోకి వెళ్తే మత్తిలి ఠాణా మెండుకులి గ్రామం వద్ద ఉన్న అడవిలో కొంతమంది నాటు సారా తయారు చేస్తున్నట్లు సమాచారం అందుకున్న అబ్కారీ శాఖ అధికారి హేమంత్‌కుమార్ బాఘ్ ఓ బృందంతో కలిసి దాడులు చేశారు. తయారు చేస్తున్న వ్యక్తులు పరారయ్యారు. ఘటనా స్థలం నుంచి 260 లీటర్ల నాటు సారా, 1800 కిలోల పొట్లాలు, సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో అబ్కారీ సబ్ ఇన్‌స్పెక్టర్ సురేం ద్రమాఝి, కహ్నుచరణ మల్లిక్, ప్రభాత్‌కుమార్ సాహు తదితరులు పాల్గొన్నారు.

సారా అక్రమ తయారీ కేంద్రాలపై దాడులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా అస్కా ఠాణా పరిధిలో బలిసిర గ్రామం సమీపాన భండారి బగడ కొండపై రెండు చోట్ల సాగుతున్న సారా అక్రమ తయారీ కేంద్రాలపై పోలీసులు దాడులు చేశారు. వెయ్యి లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసి, 200 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామని గంజాం పోలీసు జిల్లా యంత్రాంగం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

రైలు ఎక్కుతూ జారిపడ్డ తల్లి, కూతురు

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా చందిలి పోలీసుస్టేషన్ పరిధి సింగపూర్ రోడ్ రైల్వేస్టేషన్‌లో కదులుతున్న కోర్బాఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కుతూ తల్లి, కూతురు జారి పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టిట్లాగడ్ ప్రాంతానికి చెందిన చైతన్య చందన్ భార్య, కూతురు హాసినితో కలిసి రాయగడ జిల్లా పెంట పంచాయతీ జంజులబడి బంధువుల పెదకర్మకు వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు సింగపూర్ రోడ్ రైల్వే స్టేషన్‌లో అర్ధరాత్రి కోర్బాఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి పడ్డారు. భార్య రితిక ఎడమచేయి తెగిపోయి, కాళు విరిగిపోయింది. నాలుగేళ్ల కూతురు హాసిని చందన్ కుడిచేయి తెగిపోయింది. క్షతగాత్రులను రైల్వే పోలీసులు రాయగడ జిల్లా ఆసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సలహా మేరకు శుక్రవారం ఉదయం బ్రహ్మపుర ఎమ్కేసీజీ తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొట్లాట కేసులో నిందితుల అరెస్టు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ పట్టణంలో సోమవారం రాత్రి దుర్గా అమ్మవారి నిమజ్జన కార్యక్రమంలో రెండువర్గాల మధ్య ఘర్షణలో ఒక కిశోర బాలుడు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి పోలీసులు శుక్రవారం కిశోర బాలుడుతో సహా నలుగురిని అరెస్టు చేశారు. నిందితులు సౌరసాహికి చెందిన బన్నీ నాయక్(25), నిష్పహండి గ్రామానికి చెందిన సూరజ్ హరిజన్(21), బడ హరిజన్ సాహికి చెందిన మోహిత్ నాయక్(20)గా గుర్తించారు. నలుగురిని కోర్టులో హాజరుపర్చగా, జామీను మంజూరు కాకపోవడంతో ముగ్గురిని జైలుకు తరలించారు. బాలుడిని జువైనల్ న్యాయ స్థానంలో హాజరుపరిచారు. ఐఐసీ సంబిత్ కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం నిమజ్జన కార్యక్రమంలో రెండువర్గాల మధ్య జరిగిన కొట్లాటలో దండసిసాహికి చెందిన కిరణ్ హరిజన్, తేజబ్ కత్తిపోట్లకు గురై తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరినీ వెంటనే ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ కిరణ్(16) మంగళవారం మృతిచెందాడు. మృతికి కారణమైన నిందితులను అరెస్టు చేయాలని గ్రామస్థులు రాస్తారోకో చేయడంతో అదనపు పాలనాధికారి మహేశ్వర్ నాయక్ ఆదేశాల మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించి నిందితులను అరెస్టు చేశారు.

బంగారు ఆభరణాలు, నగదు చోరీ

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గుసాని సమితి గురండి ఠాణా పరిధి రాసూరు గ్రామంలో గురువారం ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఠాణా అధికారి రవీంద్రపాత్రో తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సంతోష్ బిశ్వాల్ సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని రాత్రి ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు తెరిచి సామన్లు చెల్లా చెదురుగా పడి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించాడు. 2 తులాల బంగారం గొలుసుతో పాటు రూ. 20 వేల నగదు దోచుకున్నట్లు యజమాని పోలీసులకు చెప్పారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాత్రో 'న్యూస్‌టుడే' కి తెలిపారు. ఇటీవల ఓ గృహంలో చోరీకి యత్నించినా మహిళలు కావచ్చునని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

హత్య ఘటనలో ఒకరి అరెస్టు

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి సమితి ఎం.వి.8 గ్రామంలో బుధవారం రాత్రి మద్యం తాగడానికి పిలిచి ఒకరిని హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో శుక్రవారం పోలీసులు ఒకరిని అరెస్టు చేశారు. ఎస్‌డీపీఓ సచిన్‌పటేల్ విలేకర్ల సమావేశంలో తెలిపిన వివరాలు మేరకు..ఎం.వి.7 గ్రామానికి చెందిన విధాన్ మండల్ అనే వ్యక్తి, ఎం.వి.8 గ్రామానికి చెందిన మిలన్ మజుందార్ ఇద్దరు స్నేహితులు. 15 రోజుల క్రితం ఇద్దరు కలసి మద్యం తాగిన సమయంలో మిలన్ మజుందార్, విధాన్ భార్యపై తప్పుడు మాటలు చెప్పారు. ఈ విషయంపై విధాన్, మిలన్ మధ్య గొడవ జరిగింది. వాగ్వాదం అనంతరం మిలన్ మజుందార్, విధాన్ ఇంటి ఎదుట తిరుగుతుండంతో విధాన్ పథకం ప్రకారం మిలన్‌ను హత్య చేయాలని నిర్ణయించాడు. బుధవారం రాత్రి విధాన్ మద్యం తాగేందుకు స్నేహితుడిని పిలిచాడు. ఈ సమయంలో తాను తెచ్చుకున్న కత్తితో మిలాన్‌ను పొడిచి హత్య చేశాడు. అతని వద్ద ఉన్న బంగారు నగలు డబ్బులు తీసుకుని, చరవాణిని సమీప చెరువులో పడేశాడు. ఈ కేసుపై దర్యాప్తు చేసిన పోలీసులు విధాన్ అరెస్టు చేశారు.

24 నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణంలోని మలంచా ప్రాంతంలో ఉన్న తిరుపతి శ్రీ వేంకటేశ్వర పెరుమాళ్ళ దేవస్థానం 26వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 24వ తేదీన ప్రారంభమై 29తో ముగుస్తాయని ఆలయ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 24వ తేదీ అంకురార్పణ, 25వ తేదీన సామూహిక కుంకుమార్చనలు, రాత్రి హంస వాహనసేవ, 26వ తేదీన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర కల్యాణోత్సవం, రాత్రి గజవాహన సేవ, 27వ తేదీన సూర్యనమస్కారాలు, 28వ తేదీన అష్టోత్తర శత కలశస్థాపన, సహస్ర దీపాలంకరణ సేవ, పుష్పయాగం, 29న అన్నప్రసాద వితరణతో ఈ వేడుకలు ముగిస్తాయి. భక్తులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని బాలాజీ మందిర్ ట్రస్ట్ సభ్యులు కోరారు.



శివపార్వతుల విగ్రహాల తిరువీధి

ముగిసిన గౌరీపౌర్ణమి ఉత్సవాలు

రాయగడ గ్రామీణం,న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం రాయగడలో మూడు రోజుల పాటు మహిళలు నిర్వహించిన గౌరీపూర్ణిమ ఉత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. స్థానిక కంద్రవీధిలో చేపల వ్యాపారులు దశాబ్దాలుగా ఈ ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శుక్రవారం నాగావళి నదిలో నిమజ్జన కార్యక్రమం జరిగింది. అంతకు ముందు ఉత్సవ విగ్రహాలను మహిళలు పట్టణంలో తిరువీధి చేపట్టారు.

కొత్త ఈవోగా కృత్తిబాస్ సాహు



జయపురం, న్యూస్‌టుడే: జయపూర్ పురపాలక కార్యనిర్వాహణాధికారి(ఈఓ)గా కృత్తిబాస్ సాహు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కార్యాలయంలో అధికారులు ఈఓకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఆగస్టు 30వ తేదీన ప్రభుత్వ గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ రాష్ట్రంలో 118 పట్టణ లక ఏఈలను నియమిస్తున్నట్లు ప్రకటించింది.

ఆధార్ మేళా

కొరాపుట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో రెండు రోజులు జరిగిన ఆధార్ మేళా శుక్రవారంతో ముగిసింది. రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సుభద్ర పథకానికి కొరాపుట్ జిల్లాకు చెందిన ఎక్కువ మంది లబ్ధిదారులు ఆధార్‌లో సమస్యలు తలెత్తడంతో పాలనాధికారి వి.కీర్తివాసన్ రెండు రోజులు ఆధార్ మేళా ఏర్పాటు చేశారు. లబ్ధిదారులు తమ గుర్తింపు కార్డుల్లో తప్పులను సరిచేసుకునేందుకు బారులు తీరారు.



ఆధార్ మేళాలో బారులుతీరిన లబ్ధిదారులు

నర్సుపై రోగి కుటుంబసభ్యుల ఫిర్యాదు

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరిలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఓ నర్సుపై రోగి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే శుక్రవారం ఉదయం పట్టణానికి చెందిన రాజబాబు అనే యువకుడు తన చెల్లెకి కడుపునొప్పి రావడంతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు నాలుగో అంతస్తుకు పట్టుకువెళ్లాలని సూచించారు. తక్షణం అక్కడికి వెళ్లిన నర్సులు ఎవరు లేరు. మూడో గదిలో ఉన్న మున్మున్ విశ్వాస్ అనే నర్సును రాజా పిలిచారు. చరవాణి చూస్తూ స్పందించ లేదు. నర్సు ప్రవర్తనపై రాజా నిలదీశారు. ఆమె భర్తతో కొట్టించేందుకు ప్రయత్నించింది. ఈ ఘటనపై రాజా జిల్లా వైద్యాధికారి బ్రజబంధు దాసికి ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మౌళి మందిరం అభివృద్ధి చేస్తాం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: అతి పురాతన మౌళి మందిరం అభివృద్ధికి కృషి చేస్తానని పొట్టంగి ఎమ్మెల్యే రామచంద్ర కడం హామీ ఇచ్చారు. ఆదివాసీ కళలు, సంస్కృతి పరిరక్షించే ఉద్దేశంతో కొరాపుట్ జిల్లా యంత్రాంగం, జిల్లా సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పరబ్ వేడుకలు ఈ నెల 27వ తేదీ నుంచి సిమిలిగుడ సమితి దుదారి సమీపంలో మౌళి మందిరం నుంచి ప్రారంభమవుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆ ప్రాంతాన్ని పర్యటించి స్థానికులతో మాట్లాడారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సోనియా మజ్జి, సర్పంచి పితాంబర్ కిర్సానీ తదితరులు పాల్గొన్నారు. పరబ్ ప్రారంభోత్సవాల నిర్వహణపై స్థలం ఎంపికపై అధికారుల బృందం సందర్శించింది. సమితి అభివృద్ధి అధికారి దేవాసిస్‌గౌడ్, అదనపు తహసీల్దార్ దేవీప్రసాద్ నాయక్, సునాబెడ ఎస్‌డీపీఓ మనోబ్రాత్ శత్పథి, ఠాణా అధికారి సచ్చింద్ర ప్రధాన్ తదితరులు ఉన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడమ్

మిడ్నాపూర్‌లో శాసనసభ ఉప ఎన్నికల సందడి

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పశ్చిమబెంగాల్లో ఆరు శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికలు నవంబరు 13న నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో మిడ్నాపూర్ శాసనసభ స్థానం ఉంది. గడిచిన లోక్‌సభ ఎన్నికల్లో స్థానిక శాసనసభ సభ్యురాలు జూన్‌మాలియా తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. ఖాళీ అయిన ఆ స్థానానికి ఉప ఎన్నిక జరుగనుంది. తృణమూల్ కాంగ్రెస్, భాజపా, వామపక్ష కూటమి అభ్యర్థులు ఎవరు పోటీ చేస్తారని చర్చ కొనసాగుతోంది.

ఏడాది గడిచినా అందని డబ్బులు




నగదు అందక కార్మికుల ఆవేదన

జయపురం, న్యూస్‌టుడే: ఉపాధి పనులు చేసి ఏడాది గడిచినా నేటికీ డబ్బులు అందలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొరాపుట్ జిల్లా కుంద్రాసమితి పుల్‌భట్టా పంచాయతీ కుసుమగూడ, జోడియాంబ గ్రామాలకు చెందిన 12 మంది కార్మికులు 2023-24లో రెండు గ్రామాల మధ్య ఆరుచోట్ల పొలాలకు నీటి సరఫరా చేసేందుకు రాతికట్టు పనులు చేశారు. వీటికి దాదాపు రూ.72 వేలకు పైగా వేతనాలు రావల్సి ఉందని, పనులు పూర్తయి ఏడాది గడిచినా గుత్తేదారుడు డబ్బులు చెల్లించలేదని, పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని కార్మికులు వాపోయారు. ఈ విషయమై పీఈఓ మానస్ రంజన్ ఖరాను అడగ్గా పంచాయతీ అధికారులతో చర్చించి కార్మికులకు బకాయి వేతనాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇలా ఉంటే ఎలా నడిచేది?

బ్రహ్మపుర బజారు, న్యూస్‌టుడే: బ్రహ్మపుర పురపాలక సంఘం (బీఈఎంసీ) తరపున వివిధ ప్రాంతాల్లో చెరువుల సుందరీకరణ, చుట్టూ నడిచేందుకు వీలుగా పలకలతో మార్గాలు, ఇతర నిర్మాణాలు చేపట్టిన సంగతి తెలిసిందే. పలు చెరువుల వద్ద అభివృద్ధి పనులు చేసినా, తరువాత వాటి నిర్వహణ విస్మరించడంతో నిరుపయోగంగా మారాయి. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన నడక మార్గాల్లో పనికిరాని మొక్కలు పెరిగిపోగా, కొన్నిచోట్ల చెత్తచెదారాలు పేరుకుపోయి పలకలు విరిగిపోయి నడవలేని దుస్థితి నెలకొంది. బెజ్జిపురం చెరువు చుట్టూ నడక మార్గం ప్రణాళిక లేకుండా నిర్మించడంతో నిరుపయోగంగా మారింది. ఈ మార్గాలను శుభ్రపరిచి మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.



నడిచే దారిలో మొలిచిన పనికిరాని మొక్కలు

కలుషిత నీరు తాగేదెలా?

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణంలో గత కొద్ది రోజులుగా కలుషిత నీరు సరఫరా కావడంతో ప్రజలు తాగేందుకు ఇబ్బందులు పడుతున్నారు. నీటిని శుద్ధి చేయకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడిందని నగరవాసులు వాపోతున్నారు. పలుమార్లు ఆ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అంటున్నారు. పట్టణంలో 80 శాతం ప్రజలు ప్రజారోగ్య శాఖ పైపుల ద్వారా సరఫరా చేసిన నీటిపైన ఆధారపడుతున్నారు. ఈ కలుషిత నీరు తాగడంతో వివిధ రోగాలబారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆ శాఖ ఇంజినీరు బిచిత్రనంద్ బెహరాను 'న్యూస్‌టుడే' అడగ్గా కలుషిత నీరు సరఫరా అవుతుండడం వాస్తవం అని, తరువాత మంచినీరు వస్తోందని తెలిపారు. తనిఖీలు చేసి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.



నీళ్ల సీసాల్లో కిందకి చేరిన మట్టి

విశ్వశాంతి సముద్ర హారతి

గోపాలపూర్, న్యూస్‌టుడే: శ్రీజగన్నాథ చైతన్య చేతన సమితి భక్తుల ఆధ్వర్యంలో గోపాల్‌పూర్ స్వర్గద్వార తీరం పార్కు ఆవరణలో కుమార పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం రాత్రి 118వ సముద్రహారతి ఇచ్చారు.



గోపాల్‌పూర్ స్వర్గద్వారంలో సముద్రునికి హారతిస్తున్న భక్తులు

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు రాష్ట్ర మహిళా జట్టు



బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంలో ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న ఆలిండియా రాజ్‌మాతా జీజాబాయ్ ట్రోఫీ-2024-25 సీనియర్ మహిళా ఫుట్‌బాల్ పోటీలకు రాష్ట్ర జట్టు సిద్ధమైంది. జట్టు క్రీడాకారిణులు 22 మంది గురువారం అనంతపురం పయనమయ్యారు. జట్టులో సుష్మిత పున్, మంజుగంజు (గోల్‌కీపర్), రాణిబాగ్, ప్రజ్ఞాకిసాన్, అమృతానాయక్, సులేఖా కవార్, సుభాషిణి సహ, శ్రద్ధాంజలి పండా, శిబానీ ముండారీ (డిఫెండర్), ప్రయాస సర్కార్, జాహ్నవి కిసాన్, ఇప్సితా రౌత్, మునికా మింజ్, దీపా నాయక్ (మిడ్‌ఫీల్డర్), లక్ష్మిప్రియ లెంకా, సుభద్రా సాహు, సత్యబతి ఖడియ, మాలతిముండా, మనీషా నాయక్, ప్యారీ ఖాఖా, ప్రతిమ ఒరామ్, పుష్పశ్రీ ముండా (ఫార్వర్డ్)లు స్థానం పొందారు.

చదరంగం విజేతలు వీరే

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: భారత చదరంగం సంఘం సౌజన్యంతో ఒడిశా చదరంగం సంఘం తరపున ఈ నెల 13వ తేదీ నుంచి 17 వరకు 18వ కేటీ గ్లోబల్ స్కూల్ ఓపెన్ చదరంగం పోటీలు జరిగాయి. ఖుర్దాలోని బరునెయిలో నిర్వహించిన ఇందులో కటక్ చెందిన శ్రేయస్‌శుభం పట్నాయక్ ఛాంపియన్‌గా నిలిచాడు. రెండు, మూడుస్థానాల్లో రబీంద్రకుమార్ ఒఝా, హర్షిత్‌రంజన్ సాహు నిలిచారు. పోటీలనంతరం జరిగిన ముగింపుకార్యక్రమంలో అతిథులుగా హాజరైన రాష్ట్ర సంఘం అధ్యక్షుడు జీసీ మహాపాత్ర్, కేటీ గ్లోబల్ స్కూల్ ప్రధానాచార్యుడు దీప్‌ఖరే, చీఫ్ అర్బిటర్ జ్యోతిశంకర్ నంద, కోచ్ సత్యరంజన్‌పట్నాయక్‌లు విజేతలకు బహుమతులతో పాటు నగదు పారితోషికం అందజేశారు.



బహుమతులతో విజేతలు: చిత్రంలో అతిథులు, నిర్వాహకులు



కొమ్మాపల్లి కూడలిలోని నాయక్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

బృందావన నాయక్‌కు నివాళులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: రాజకీయాలు, విద్యారంగంలో విశేష కృషి చేసిన బృందావన నాయక్ సేవలు చిరస్మరణీయమని వక్తలన్నారు. నాయక్ 40వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కోర్టుపేట కూడలిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిరోడ్డులోని గీతా భవన్‌లో స్మారక సమావేశం నిర్వహించారు. బ్రహ్మపుర మాజీ శాసనసభ్యుడు డాక్టర్ రమేష్‌చంద్ర చ్యవుపట్నాయక్, బిజద నాయకుడు సుభాష్ మహరణా, ఎస్ఎంఐటీ విద్యాసంస్థల ముఖ్యులు భగవాన్ గంతాయత్ తదితరులు పాల్గొన్నారు.

రతన్‌టాటాకు శ్రద్ధాంజలి

గోపాలపూర్, న్యూస్‌టుడే: పారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటా ఆత్మకు శాంతి చేకూరాలని శుక్రవారం పలువురు మహామృత్యుంజయ మంత్ర జపం చేశారు. ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు.

సమితి సభ్యుడిపై దాడి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా హింజిలి సమితిలోని దయాపల్లి పంచాయతీ సమితి సభ్యుడు ఈ.రాజారావుపై శుక్రవారం ఒకరు ఇనుప ఊచతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. సమితి సభ్యుడు దుర్బంధ గ్రామం వెళుతుండగా దయాపల్లి గాంధీ కూడలి సమీపాన ఈ దాడి జరిగింది. తీవ్రంగా గాయపడ్డ ఆయనను స్థానికులు కాపాడి, బెల్‌గావ్‌లోని ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. బాధితుడికి ప్రాథమిక చికిత్స అనంతరం ఎమ్కేసీజీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. దాడికి గల కారణాలింకా తెలియలేదు.

కుప్పకూలిన పెండాళ్... తప్పిన ముప్పు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కటక్‌లోని ఖాన్ నగర్ పరిధిలో నేతాజీ కూడలి ఆవరణలో శుక్రవారం దుర్గా పూజా పెండాళ్ అకస్మాత్తుగా కుప్పకూలింది. దీని కింద ఒక కారు, రెండు ఆటోరిక్షాలు, రెండు బైకులు పాడయ్యాయి. ఆ సమయంలో అక్కడ జనం లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.



ప్లిజలిన్‌కు కాంస్యం

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఉజ్బెకిస్థాన్‌లో ఈ నెల 7 నుంచి 16 వరకు జరిగిన ఎనిమిదో ఆసియా పెన్‌కాక్ సిలెట్ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారిణి ప్లిజలిన్ తొరాయి మూడో స్థానంలో నిలిచి కాంస్యపతకం గెలుచుకుంది. ఈమేరకు రాష్ట్ర క్రీడా శాఖ 'ఎక్స్'లో ఆ వివరాలు వెల్లడించింది. ఆమెను అభినందించింది. పోటీల్లో ప్లిజలిన్ అద్భుత ప్రతిభ కనబరిచిందని కొనియాడింది.



కాంస్య పతకంతో ప్లిజలిన్ తొరాయి

మామిడి చెట్టుకు 15 రకాల కాయలు

మందార మొక్కకు 20 రకాల పూలు

తురాయిపువలస నర్సరీలో వినూత్న ప్రయోగం



అంటు కట్టిన మందార మొక్కలను చూపిస్తున్న ఉద్యానశాఖ అధికారి కాంతారావు

నచ్చిన మామిడి పండ్లను ఇంట్లోనే పండించి తినొచ్చు.. ఇష్టమైన పూలను పెరట్లోనే పెంచి కోసుకోవచ్చు.. దీని కోసం వందల చెట్లు, మొక్కలు అవసరం లేదండోయ్.. ఒక్క మామిడి చెట్టు నుంచే వివిధ రకాల పండ్లను పొందవచ్చు. అలాగే ఒకే మందారం చెట్టు నుంచి నచ్చిన పూల రకాలను పెంచుకోవచ్చు. ఈ అరుదైన ప్రయోగానికి శ్రీకారం చుట్టారు పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటీడీఏకు చెందిన తురాయిపువలస ఉద్యాన క్షేత్రం అధికారులు. మిక్స్‌డ్ పేరుతో అంట్లు కట్టే విధానాన్ని ప్రారంభించారు. ప్రయోగాత్మకంగా కొన్ని రోజులుగా వీటి తయారీకి చర్యలు చేపట్టారు. ఒకే చెట్టుకు 15 నుంచి 20 రకాల మామిడి కాయలు, మందార మొక్కకు సుమారు 20 రకాల పూలు పూసేలా సిద్ధం చేస్తున్నారు.

కుండీలుంటే చాలు..

అవసరం మేర ఈ మొక్కలను నాటుకోవచ్చు. స్థలం లేకపోతే పెద్ద కుండీల్లోనూ పెంచుకోవచ్చు. అంటు కట్టిన మందారం మొక్క నుంచి మూడు నెలల్లోనే నచ్చిన పూలు వస్తాయి. మామిడికి సంబంధించి రెండేళ్ల పాటు పూతను తొలగించాలని, మూడో ఏడాది నుంచి కాపునకు వదిలేయాలని ఉద్యానశాఖ అధికారి కె.కాంతారావు తెలిపారు. ప్రస్తుతం రెండేసి వేల చొప్పున తయారు చేస్తున్నామని, మరో రెండు నెలల్లో మందార మొక్కలను సరఫరా చేస్తామని చెప్పారు. రానున్న రోజుల్లో నిమ్మ, బత్తాయిపై కూడా ప్రయోగాలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సాధారణంగా రెండు మూడు రకాలతో అంటు నాటుతారని, కానీ తాము అత్యధికంగా 20 రకాలతో మొక్కలను తయారు చేస్తున్నామన్నారు. ఈ విధానంతో నచ్చిన పండ్లు, పూలు ఇక్క వద్దే అందుబాటులో ఉంటాయని చెప్పారు. - న్యూస్‌టుడే, సీతంపేట



అంటు కట్టిన మామిడి మొక్క

పాల ఉత్పత్తిదారుల నిరసన

సీతానగరం, న్యూస్‌టుడే: పాల సేకరణ ధరను పెంచాలని కోరుతూ కాశాపేట పాల శీతలీకరణ కేంద్రం వద్ద పాడి రైతులు ఆందోళన చేపట్టారు. రైతు సంఘం జిల్లా నాయకుడు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ.. పాడి పశువుల పెంపకానికి ఖర్చులు పెరుగుతున్నాయని, పాల సేకరణ ధర పెంచాలని డిమాండు చేశారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం

పాలకొండ గ్రామీణం: విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన ఉండాలని పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డా.ఎం. శ్యాంబాబ్ పేర్కొన్నారు. కళాశాలలో కుష్ఠు అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు, గుర్తింపు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిపుణులు కె.ప్రసాద్ వివరించారు.

దుర్వాసన భరించలేం

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలోని కోమటివీధిలో కాలువలు పరిశుభ్రం చేయకపోవటంతో రహదారిపైకి మురుగునీరు చేరుతోంది. కాలువల్లో చెత్త తొలగించకపోవటంతో చెత్తతో నిండి దుర్గంధం వెదజల్లుతోందని అధికారులు స్పందించి కాలువల్లో చెత్త తొలగించాలని కోరుతున్నారు. సిబ్బందిని పంపించి కాలువల్లో పూడికలు తొలగించేలా చర్యలు తీసుకుంటామని శానిటరీ హెల్త్ అసిస్టెంట్ శేఖర్ తెలిపారు. -న్యూస్‌టుడే, పలాస



పాకలో వంట.. ఎన్నాళ్లీ తంటా

రాజపురం ఆదర్శ పాఠశాలలో వంటషెడ్ లేక వంట సిబ్బందికి అవస్థలు తప్పడం లేదు. పాఠశాలలో 450 మంది, కళాశాలలో 170 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారికి రోజు రాగిజావ, మధ్యాహ్న భోజనం, అనంతరం పకోడీగా విద్యార్థులకు వంట తయారీకి సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ప్రిన్సిపల్ ఎ.ఈశ్వరరావు వివరణ కోరగా ఉన్నతాధికారులకు తెలియజేయడం జరిగిందని, నిధులు వచ్చిన వెంటనే నిర్మిస్తామన్నారు. -న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం



ఒడిసి పడదాం.. భూగర్భ జలాలు పెంచుదాం

న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

భూగర్భ జలాల పెంపుపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. వర్షపు నీరు ఒడిసి పట్టి.. వృథా నీటిని భూములోకి మళ్లించేలా అధికారులు చర్యలు చేపట్టారు. సాగునీటి ఎద్దడి నివారణకు ప్రతి గ్రామంలోని పంట భూముల్లో నీటి కుంటలు (ఫామ్ పాండ్స్) అందుబాటులోకి తీసుకురానున్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా కుంటలు తవ్వుతున్నారు.



గుమ్మలక్ష్మీపురం మండలంలో కుంట తవ్వుతున్న కూలీలు

జిల్లాలో సేద్యపు కుంటల నిర్మాణాలు చేపట్టేందుకు ఉపాధి హామీ అధికారులు ప్రణాళికలు వేశారు. ఒక్కో కుంటకు పరిమాణం బట్టి రూ.10 వేల నుంచి రూ.60 వేలు నిధులు కేటాయిస్తున్నారు. జిల్లాలోని 178 పంచాయతీల్లో 717 కుంటలు ఏర్పాటు చేయడమే లక్ష్యంగా నిర్దేశించారు. ఈ నెల 7 నాటికి 323 చోట్ల పనులు ప్రారంభించగా.. 264 చోట్ల పూర్తి చేశారు. బలిజిపేట మండలంలోని 15 పంచాయతీల్లో అత్యధికంగా 147 మంజూరవగా 18 పూర్తి చేశారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని 19 పంచాయతీల్లో 104 పనులకు గాను 59 చోట్ల జరిగినట్లు అధికారులు తెలిపారు.

ఎంతో ఉపయోగం

సేద్యపు కుంటలు తవ్వడంతో భూగర్భ జలాలను పెంపొందించుకోవచ్చు. వృథా నీటిని గుంతల్లోకి మళ్లిస్తే నీటి ఎద్దడి సమయంలో ఎంతోగానో ఉపయోగపడతాయి. ప్రస్తుతం జిల్లాలో పనులు చురుగ్గా సాగుతున్నాయి. లక్ష్యాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం.

– రామచంద్రరావు, డ్వామా పీడీ

ఎన్నో ప్రయోజనాలు..

పంట భూముల్లో సేద్యపు కుంటలు నిర్మిస్తే నీటి ఎద్దడి తగ్గుతుంది. భూగర్భ జలాలు పెరుగుతాయి. మెట్ట ప్రాంతాల్లో రైతులు అవసరం మేరకు సాగు నీరు వాడుకోవచ్చు. ఏజెన్సీలో కొండలపై నుంచి జాలువారే ఊట నీరు ఒడిసి పట్టే అవకాశం ఉంది. వేసవిలో పశువులు, మూగ జీవాల దాహార్తి తీర్చేందుకు ఉపయోగపడతాయి. నీటి సౌకర్యం లేని ప్రాంతాల్లో తక్కువ ఆరు తడి పంటలు వేసుకొని లాభసాటి వ్యవసాయం చేయొచ్చు.

విస్మరించిన గత ప్రభుత్వం..

భూగర్భ జలాలను పెంచాలనే ఉద్దేశంతో గతంలో తెదేపా ప్రభుత్వం ప్రజల్లో అవగాహన కల్పించింది. అప్పట్లో రూ.10 వేలు చొప్పున కేటాయించి ఇళ్లు, బోర్లు, బావుల వద్ద ఇంకుడు గుంతలు తవ్వించింది. ఉమ్మడి జిల్లాలోని మెట్ట భూముల్లో పంట సంజీవిని పేరుతో సుమారు 20 వేల వరకు సేద్యపు కుంటలు నిర్మించారు. 2019 వరకు ఈ కార్యక్రమం సాగింది. వైకాపా వచ్చాక పథకం పూర్తిగా పడకేసింది.

కొండను తొలిచి.. లేఅవుట్‌గా మలిచి!

రూ.లక్షలు విలువ చేసే కంకర తరలింపు



రూపు కోల్పోయిన నెమలికొండ దిగువ భాగం

న్యూస్‌టుడే, కాశీబుగ్గ

పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల పరిధిలోని నెమలికొండ అక్రమార్కుల పరమవుతోంది. దీని చుట్టూ గతంలో పలు ఆక్రమణలు చోటుచేసుకున్న విషయం విదితమే. కొన్ని రోజులుగా నెమలికొండ దిగువ భాగం ముస్లిం కాలనీ వైపు సుమారు 1.40 ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్ వేసేందుకు సిద్ధం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే కొండను తొలిచి కంకర వ్యాపారం చేసినట్లు స్పష్టమవుతోంది.

◆ నెమలికొండ దిగువన జిరాయితీ సర్వే నంబరు చూపుతూ కొండ భాగాన్ని చదును చేస్తున్నారు. ఇందులో భాగంగా కొన్ని రోజులుగా రాత్రి వేళ కంకర అక్రమ తవ్వకాలు జరిగాయి. ఇక్కడి నుంచి సుమారు రూ.20 లక్షల విలువ చేసే కంకర తరలించినట్లు సమాచారం. కొండ దిగువ భాగాన్ని యంత్రాలతో తవ్వేశారు. అదే కంకరతో లేఅవుట్‌కు రహదారి ఏర్పాటు చేస్తున్నారు. సూదికొండ సచివాలయం వెనుక ఈ వ్యవహారం యథేచ్ఛగా సాగుతున్నా సిబ్బంది స్పందించే పరిస్థితి లేదు.



లోతుగా తవ్విన ప్రాంతం

◆ పలాసకు చెందిన ఓ రైతుకు సమీపంలో జిరాయితీ భూమి ఉండేది. దీనికి సంబంధించి విక్రయాలు జరిగిపోయాయి. తాజాగా అదే జిరాయితీ సర్వే నంబర్‌ను చూపి కొండ దిగువ భాగం ప్రభుత్వ భూమిలో అక్రమాలకు తెర లేపారు. చదును చేసి లేఅవుట్‌గా మార్చిన స్థలం విలువ రూ.2 కోట్ల వరకు ఉంటుంది. ఈ లేఅవుట్‌కు పక్కన ఇప్పటికే సుమారు రెండు ఎకరాల వరకు ప్రభుత్వ భూమి గతంలో అక్రమార్కుల పరమైంది. నిర్మాణాలు సైతం జరిగిపోయాయి. తాజాగా 1.40 ఎకరాల వరకు కొందరు కాజేయాలని పథకం వేశారు.



లేఅవుట్ ప్రాంతానికి ఏర్పాటు చేస్తున్న రహదారి

చర్యలు తీసుకుంటాం..

క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఆక్రమణలు చోటుచేసుకుంటే ఎంతటి వారైనా ఉపేక్షించబోం. అనుమతులు లేకుండా కంకర రహదారులు నిర్మించకూడదు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

- టి.కల్యాణచక్రవర్తి, తహసీల్దారు, పలాస

తప్పిన పెను ప్రమాదం



పొలంలో బోల్తా పడిన కర్రల లారీ

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పార్వతీపురం మండలంలోని బుచ్చింపేట వద్ద పెను ప్రమాదం తప్పింది. ఒడిశాలోని హుకుంపేట నుంచి కర్రల లోడుతో వస్తున్న లారీ బుచ్చింపేటలోని ఆంజనేయ ఆలయం సమీపంలోని మలుపులో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పింది. పొలంలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఘటనలో రాజమహేంద్రవరానికి చెందిన చోదకుడు సింహాచలానికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

రక్తహీనత కేసులతో జాగ్రత్త



మందులు పరిశీలిస్తున్న జగన్మోహనరావు

బలిజిపేట, న్యూస్‌టుడే: బలిజిపేట పీహెచ్‌సీలోని రక్త పరీక్ష కేంద్రం, ప్రయోగశాలను వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహన్‌రావు తనిఖీ చేశారు. ఆసుపత్రిలో చేస్తున్న రక్త పరీక్షల తీరును పరిశీలించారు. రక్తహీనత కేసులు నమోదైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీలోని దస్త్రాలు, మందులు పరిశీలించారు.

చిన్నారులకు విద్య, పోషకాహారం తప్పనిసరి

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత పిల్లలకు పోషకాహారం, విద్య చేరువ చేయాలని కలెక్టరు ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని డోకిశీల పంచాయతీలో అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి చిన్నారులతో ముచ్చటించారు. డోకిశీలలో గదులు సరిపోవడం లేదని కార్యకర్త తెలపగా.. మరో గది కేటాయించాలని ఎంపీడీవో రూపేష్‌కు సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రం పరిసరాలు శుభ్రం చేసి పిల్లల పార్కు ఏర్పాటు చేయాలని సర్పంచి జగదీశ్, కార్యదర్శి మధును ఆదేశించారు. డెప్పివలసలో నిర్మాణంలో ఉన్న వనదన్ వికాస కేంద్రాలను పరిశీలించి మహిళలు వినియోగించేలా చూడాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ సత్యంనాయుడు, డీఎల్‌డీవో రమేష్, తహసీల్దారు జయలక్ష్మి, ఐసీడీఎస్ పీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులతో ముచ్చటిస్తున్న కలెక్టరు శ్యామ్‌ప్రసాద్

పుర వీధుల్లో.. నిర్లక్ష్యపు చీకట్లు!

న్యూస్‌టుడే పరిశీలన

☛ పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘ పరిధి కె.టి.రోడ్డులో కాశీబుగ్గ మూడు రహదారుల కూడలి నుంచి పలాస ఇందిరాచౌక్ వరకు సుమారుగా 70 స్తంభాలు ఉండగా 51 వీధి దీపాలు వెలగటం లేదు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జీడిపండు కూడలి వరకు వీధి దీపాల కేబుల్ కాలిపోవడంతో రాత్రి వేళ జంట పట్టణాల వాసులు అంధకారంలో రాకపోకలు సాగిస్తున్నారు.

☛ ఇచ్ఛాపురం పురపాలక సంఘ పరిధి పెదాకుల వీధిలో వీధి దీపం కొన్ని నెలలుగా వెలగడం లేదని స్థానికులు ఎన్ని విజ్ఞప్తులు ఇచ్చినా ఫలితం లేదు. ఆ ప్రాంతాన్ని పర్యవేక్షించడానికి ముగ్గురు సిబ్బంది ఉన్నా చర్యలు శూన్యం.

☛ ఆమదాలవలస పురపాలక సంఘం శివారు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో చీకట్లోనే రాకపోకలు సాగిస్తున్నారు.

☛ శ్రీకాకుళం నగరం వన్‌వే ట్రాఫిక్ రహదారిలో 83 స్తంభాలు ఉన్నాయి. ఈ మార్గంలో 7 దీపాలు వెలగడం లేదు. రూ.లక్షలు వ్యయం చేసి పరికరాలు కొనుగోలు చేస్తున్నా నిర్వహణ కొరవడింది.



పలాస కె.టి.రోడ్డులో వెలగని వీధి దీపాలు

పలాస, ఇచ్ఛాపురం, ఆమదాలవలస పట్టణం, శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే

నిర్వహణ లోపంతో వీధి దీపాలు వెలగక పట్టణాల్లో అంధకారం నెలకొంటోంది. శ్రీకాకుళం నగరంలోనూ చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి. అధికారులు తీసుకుంటున్న తాత్కాలిక చర్యలు ఫలితం ఇవ్వడం లేదు. వైకాపా హయాంలో వీధి దీపాల నిర్వహణను ఇంధన సామర్థ్య సేవల సంస్థ (ఈఈఎస్ఎల్)కు బాధ్యతలు అప్పగించినా సక్రమంగా పర్యవేక్షించలేదు. గత ఏడాది అక్టోబరుతో ఒప్పంద గడువు ముగిసింది. పురపాలక సంఘాల పరిధిలో సంవత్సరం పాటు కొత్త ఏజెన్సీకి నిర్వహణ బాధ్యతలు అప్పగించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రాత్రి వేళ ప్రజలు చీకట్లో ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలస పురపాలక సంఘాలు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో వీధి దీపాల నిర్వహణపై కథనం.

● నిర్వహణ గాలికొదిలేయడంతో ప్రజలకు తప్పని ఇక్కట్లు

● రాత్రి వేళ ప్రమాదకరంగా రాకపోకలు




శ్రీకాకుళం నగరంలో వీధి దీపాలు వెలగని వన్‌వే ట్రాఫిక్ రహదారి

శ్రీకాకుళం

శ్రీకాకుళం నగరపాలకసంస్థ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఒకటి నుంచి 5 వరకు వీధి దీపాలు కొన్ని నెలలుగా వెలగడం లేదు. రాత్రి వేళ అంధకారం నెలకొని ఇబ్బంది పడుతున్నారు. కొన్ని చోట్ల పగలూ వెలుగుతున్నా మరమ్మతులు కరవయ్యాయి. విలీన ప్రాంతాల్లోని కాలనీల్లో పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా పని చేయని వీధి దీపాలను ఎప్పటికప్పుడు గుర్తించి మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

పలాస

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయానికి వీధి దీపాల నిర్వహణపై ప్రతిరోజు ఫిర్యాదులు వస్తున్నాయి. వార్డు సచివాలయ ఎనర్జీ కార్యదర్శులు ఉన్నప్పటికీ వారికి వేరే విధులు అప్పగిస్తుండటంతో పర్యవేక్షణ కొరవడుతోంది. కె.టి.రోడ్డు, కాశీబుగ్గ బస్టాండ్, మండల పరిషత్ కార్యాలయం వీధి, పలు వార్డుల్లో దీపాలు వెలగడం లేదని కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశాల్లో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఈ విషయమై పుర కమిషనర్ ఎన్.రామారావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడి వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చూస్తామని తెలిపారు.





ఇచ్ఛాపురం నాలుగు రోడ్ల కూడలిలో అలంకారప్రాయంగా హైమాస్ట్ దీపాలు

ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురంలో గత నెల నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో వీధి దీపాల సమస్యపై సభ్యులందరూ మాట్లాడి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నెలలు గడిచినా మరమ్మతులు చేయడం లేదని.. కొన్ని చోట్ల రాత్రి, పగలూ వెలుగుతున్నాయని ఆక్షేపించారు. విద్యుత్తు దుబారా, దీపాల నాణ్యత దెబ్బతింటోందని పేర్కొన్నారు. ప్రధార రహదారి మధ్య దీపాలు వెలిగితే బస్టాండు, రైలు నిలయం, ఆసుపత్రి తదితర ప్రాంతాలకు రాత్రి వేళ ధైర్యంగా వెళ్లగలమని పట్టణ వాసులు చెబుతున్నారు. ఈ విషయమై పుర కమిషనర్ నల్లి రమేష్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా సమస్య తలెత్తిన వెంటనే సిబ్బందిని పంపి మరమ్మతులు చేయిస్తున్నామని తెలిపారు.



ఆమదాలవలస నుంచి కుద్దిరాం గ్రామానికి వెళ్లే మార్గంలో అంధకారం

ఆమదాలవలస

ఆమదాలవలస పురపాలక సంఘంలో టి.మన్నయ్యపేట, కె.మన్నయ్యపేట, నాదానపురం, కంచరాపువానిపేట, పార్వతీశంపేట, పంతులుపేట, జగ్గుశ్రాస్త్రులపేట, ఊసవానిపేట తదితర ప్రాంతాల్లో వీధి దీపాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ బయటకు రాలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. ఈ విషయమై పుర కమిషనర్ బాలాజీప్రసాద్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా అన్ని వీధుల్లో దీపాలు వెలిగేలా చూస్తామని తెలిపారు.

వ్యాపార రంగంలో రాణించాలి



పరిశ్రమను పరిశీలిస్తున్న విద్యార్థులు

కురుపాం గ్రామీణం, గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: విద్యార్థులు స్వయం వ్యాపార రంగంలో మెలకువలు తెలుసుకొని రాణించాలని కళాశాల అధ్యాపకులు సూచించారు. ఇండస్ట్రియల్ ఎక్స్‌పోజర్ కార్యక్రమంలో భాగంగా గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం కురుపాం పామాయిల్ పరిశ్రమను సందర్శించారు. ముడి సరకు, తయారీ విధానం, అమ్మకాల గురించి విద్యార్థులు తెలుసుకున్నారు. అధ్యాపకులు ఎస్.సింహాచలం, హరికృష్ణ, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ



విద్యార్థులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్త

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకొని సాగులో నూతన పద్ధతులు కనుగొనాలని కేవీకే విస్తరణ విభాగం శాస్త్రవేత్త డా.ఎం.అనంతవిహారి సూచించారు. శుక్రవారం రస్తాకుంటుబాయి కేవీకేలో శ్రీకాకుళం జిల్లాలోని నైరా ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కేవీకే ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు, వర్మీకంపోస్టు, పుట్టగొడుగులు తయారీ, పౌల్ట్రీ, చిరుధాన్యాల డెమో యూనిట్లు చూపించారు.

రక్తహీనత లేకుండా చూడాలి

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజరు పి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం బీజేపురంలో అంగన్‌వాడీ కేంద్రం, సచివాలయం, జడ్పీ పాఠశాలను పరిశీలించారు. చిన్నారుల ఎత్తు, బరువు కొలిచారు. రక్తహీనత లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.